క్లుప్తంగా

ఘనంగా గంగానమ్మ జాతర

గుడ్లవల్లేరు(వడ్లమన్నాడు): గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడులో శుక్రవారం గంగానమ్మ జాతర ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో గ్రామ దేవత చెట్టు వద్దకు వెళ్లి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి జలవిహారం జరిగింది.

ఉపాధి నిధులు పెంచాలి

కురుమద్దాలి(పామర్రు): ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యతని, దీనికి నిధులు పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకురాలు వంకాలయపాటి శివ నాగమణి అన్నారు. కురుమద్దాలి, జమీగొల్వేపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించి అక్కడి కూలీలతో మాట్లాడారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో 30వేల కోట్లు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కోత విధించిందన్నారు. భవిష్యత్‌లో ఉపాధి పథకాన్ని రద్దు చేసే ఆలోచలో కేంద్రం ఉందన్నారు. 200 రోజుల పని దినాలు ఇవ్వాలని, వేతనం రోజుకు రూ.600 అందజేయాలని, ప్రమాద బీమా అమలు చేయాలని, మేట్లకు పదివేల రూపాయల వేతనం ఇవ్వాలని, ఎఫ్‌ఏలను పర్మినెంట్ చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 29న మచిలీపట్నం కలెక్టర్ ఆఫీస్ వద జరిగే కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా సంఘాల నాయకులు ఒగుడు గంగాధర ప్రసాద్, ముళ్లపూడి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలతో అవ్వా, తాతలకు మేలు



తోట్లవల్లూరు: వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాలతో అవ్వా, తాతలకు మేలు జరుగుతోందని వైద్యాధికారి వి.వి. రాజేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని దేవరపల్లి శివారు పాములపాటివారిపాలెంలో వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం(ఫేజ్ 3) శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అరవై ఏళ్లు నిండిన అవ్వా, తాతలకు కంటి పరీక్షలు చేశారు. కళ్లజోళ్లు అవసరమైన వారికి ఉచితంగా అందిస్తామని, ఆపరేషన్లు అవసరమైన వారిని రిఫర్ చేస్తామని ఆయన చెప్పారు. ఎంపీహెచ్ఈఓ శ్రీధర్, ఎంపీహెచ్ఏ మహా నందీశ్వరరావు, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు సలోమి, అరుణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కైలే పరామర్శ



తోట్లవల్లూరు: వ్యాపారవేత్త, సుధీర్ టింబర్ డిపో అధినేత నూకల లింగమూర్తికి సతీ వియోగం కలిగింది. ఆయన భార్య నూకల వెంకట సుబ్బమ్మ(82) యాకమూరులోని స్వగృహంలో శుక్రవారం వేకువజామున కన్నుమూశారు. ఆమె భౌతికకాయాన్ని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. విశ్వశాంతి, శ్రీనివాస విద్యాసంస్థల అధినేతలు మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు, డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు నివాళులర్పించారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణతో యువతకు ఉపాధి

అవనిగడ్డ: నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, హేచరీ ప్రొడక్షన్ వర్కర్ కోర్సుల్లో 52 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారికి కళాశాలలో జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీఓ షేక్ అతావుల్లా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి, కళాశాల ఎస్‌పీఓసీ ఎం.రామారావు, ట్రైనర్ బి.జయసాయి, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి సాయం

కోడూరు: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ చేయూతనిచ్చింది. ఉల్లిపాలెం గ్రామానికి చెందిన చాట్రగడ్డ రంగారావు నివాస గృహం, మేకల చావిడి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం కాలిపోయింది. రెడ్‌క్రాస్ మండల శాఖ సభ్యులు శుక్రవారం బాధితులను పరామర్శించారు.
సొసైటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి గృహోపకరణాలు, నూతన దుస్తులు, కూరగాయలు అందించారు. బడే కృష్ణ సైకిల్ షాపు సహకారంతో 25 కిలోల బియ్యం ఇచ్చారు. సొసైటీ మండలాధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ తోట శ్రీనివాసరావు, సభ్యులు కొండవీటి సురేష్, రేపల్లె యోగప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

మొవ్వ: ప్రజా సమస్యలను అధికారులు, ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్ పర్సన్ల దృష్టికి తీసుకు రావడమే కాకుండా వాటి పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత ఎంపీటీసీలు, సర్పంచ్‌లపై ఉందని కృష్ణా జిల్లా చైర్ పర్సన్ ఉప్పాల హారిక రాము సూచించారు. మండల కేంద్రం మొవ్వలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌తో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతిని, అందిస్తున్న సంక్షేమాన్ని వివరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ హారిక మాట్లాడుతూ దేశంలోని 28 రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రవేశ పెట్టి సంక్షేమ పథకాల అమలులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. అభివృద్ధి అంటే అద్దాల సౌధాలు కాదని, ప్రతి వ్యక్తి, కుటుంబానికి సంక్షేమం అందించి తద్వారా వ్యక్తి, కుటుంబం, గ్రామాలు, జిల్లాలు అలా రాష్ట్రాభివృద్ధి సాధిస్తేనే నిజమైన అభ్యున్నతి అన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని, మెడికల్ అండ్ హెల్త్ అధికారులు గైర్హాజరవ్వడంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

50శాతం రాయితీపై జిల్లా పరిషత్ సహకారంతో మొవ్వ మండలంలో శిక్షణ పొందిన 34 మంది మహిళలకు శుక్రవారం మొవ్వ ఎంపీడీవో కార్యాలయంలో కుట్టుమిషన్లను జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పంపిణీ చేశారు.

● ఆత్మీయ స్వాగతం



గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెంలో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వలంటీర్ల సేవలు అభినందనీయం



నందివాడలో వలంటీర్లకు సత్కారం

గుడివాడ టౌన్(నందివాడ): ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంపీపీ పెయ్యల ఆదాం అన్నారు. నందివాడలోని కొండపల్లి కన్వెన్షన్ హాల్లో శుక్రవారం గ్రామ వలంటీర్లకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరవెయ్యడంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశానికే ఆదర్శమని కొనియాడారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ మాట్లాడుతూ కేగౌరవ వేతనం పొందుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. మండలంలో మొత్తం వజ్రం-1, రత్నాలు-5, మిత్ర-194 సత్కారాలు పొందారు. కార్యక్రమంలో తహసీల్దార్ భవన్నారాయణ, ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, జెడ్పీటీసీ కందుల దుర్గాకుమారి, ఉప ఎంపీపీలు పూడి సుధాకరరావు, కొప్పుల జయరాజు, మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ కొండపల్లి కుమార్‌రెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరక్టర్ నగుళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మండవల్లి: మండలంలోని పుట్లచెరువు, పెనుమాకలంక, గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.ఆనందబాబు పేర్కొన్నారు. అభ్యర్థులు 10 తరగతిలో తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. గ్రామానికి చెందిన వ్యక్తి అయి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.

పీఎంజేజేబీవై చెక్కు అందజేత



మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరంలో శుక్రవారం పీఎం జీవన జ్యోతి బీమా యోజన ద్వారా రూ.2 లక్షల చెక్కును స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ దుర్గారావు శుక్రవారం అందజేశారు. గ్రామానికి చెందిన కుంచె ఆంజనేయులు ఈ పథకంలో చేరారు. ఇటీవల అతను సహజ మరణం పొందాడు. అతని కుటుంబానికి సర్పంచ్ బోనం శేషగిరి చేతుల మీదుగా చెక్కు అందజేశారు. సర్పంచ్ శేషగిరిరావు, ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ దుర్గారావు మాట్లాడుతూ పీఎం బీమా పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇస్తున్నాయన్నారు. ఉప సర్పంచ్ ఇంటి నాగరాజు, ఎం.మల్లికార్జునరావు, ఇంటి విజయ, వెల్ఫేర్ అసిస్టెంట్ వర్మ, బ్యాంక్‌మిత్ర సీహెచ్ వెంకట కళ్యాణి మహిళలు పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూల్-2లో ఏఎల్ఎస్ఓ విజిట్



మండవల్లి: స్థానిక ఎంపీపీ స్కూల్-2, జేవీకే-4 జగనన్న విద్యాకానుక పాయింట్‌లో ఏలూరు జిల్లా సమగ్రశిక్ష ఏఎల్ఎస్ఓ జి.రాధాకృష్ణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. జగనన్న విద్యాకానుక మెటీరియల్ ఈ నెలాఖరుకు జేవీకే-4 పాయింట్‌కు వస్తాయని ఆయన చెప్పారు. వీటిని నేరుగా స్కూల్‌కు అందజేస్తామని, ఈ మేరకు ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారని తెలిపారు. పాఠశాల తెరిచే నాటికే పిల్లలందరికీ షూస్, యూనిఫామ్, బ్యాగులు, బెల్ట్, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు అందజేస్తారని వివరించారు.

నైవేద్యాల సమర్పణ

అడపావారిపాలెం(మోపిదేవి): అడపావారిపాలెంలోని అమ్మవారి తల్లి సంబరం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అడపా వారి ఆడపడుచులు పసుపు, కుంకుమ, నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అడపావారి వంశీకులు, ఆడపచుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. కమిటీ సభ్యులు అడపా రాంబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణతో విద్యార్థులకు మేలు



కలిదిండి గ్రంథాలయంలో విద్యార్థుల పఠనం



శిక్షణ పొందుతున్న చిన్నారులతో జమలపూర్ణమ్మ

గుడివాడ టౌన్: విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసి వారికి వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వడానికి నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడతాయని కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల నిర్వహణను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు టి.ప్రవల్లిక, పి. శాంతి, వి.సునీత, చిన్నారులు పాల్గొన్నారు.

జమీగొల్వేపల్లి(పామర్రు): జమీగొల్వేపల్లిలో శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు అందమైన దస్తూరిపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.
గ్రంథాలయ అధికారి నాగ సురేష్ మాట్లాడుతూ దస్తూరి బాగుంటే పరీక్షలలో అధిక మార్కులు పొందవచ్చన్నారు.

పామర్రులో..
గ్రామంలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు బయోలజీ అధ్యాపకులు సుధాకర్ ఆధ్వర్యంలో బయాలజీగురించి అవగాహన కల్పించి బోధించారని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీ రాణి తెలిపారు.

పెదపారుపూడి: గ్రంథాలయాల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ఎంతగానో మేలు చేస్తున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ అన్నారు. పెదపారుపూడి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ చప్పిడి సమీరా, గ్రంథాయాధికారి ఎంవీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: క్రీడలతో బాల బాలికలకు మానసికోల్లాసం కలుగుతుందని గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. శుక్రవారం అంగలూరుతో పాటు గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠన పోటీలతో పాటు ఆటల పోటీలు నిర్వహించారు.

ముదినేపల్లిరూరల్: జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు సమర్థంగా నిర్వహిస్తున్నట్టు కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ టి.జమలపూర్ణమ్మ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తోన్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని చైర్మన్ శుక్రవారం పరిశీలించారు. జిల్లాలోని గ్రంథాలయాల్లో విద్యార్థులకు, పాఠకులకు ఉపయోగపడే రీతిలో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉద్యోగార్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. గ్రంథాలయ నిర్వహణపై లైబ్రేరియన్ ఎం.శ్రీదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు బాబూరావు, ఎండీ రియాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం 19వ రోజు రీయూజ్, రెడ్యూస్, రీసైకిల్ అనే అంశం ఎంచుకుని బయోడిగ్రేడబుల్, మెటీరియల్స్‌తో మన పరిసరాల్లో తక్కువ ఖర్చుతో అందంగా ఎలా తయారు చేసుకోవాలో పిల్లలకు చక్కటి డిజైన్స్, డ్రాయింగ్ అందంగా వేసి చూపించారు.

కైకలూరు: కలిదిండి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో మ్యూజికల్ చైర్స్, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్ కార్యక్రమాలను నిర్వహించారు. కై కలూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో గ్రంథలయాధికారి రాఘవులు పుస్తక పఠనం చేయించారు.

ఎఫ్‌ఏలకు నియామక ఉత్తర్వులు

పామర్రు: మండల పరిధిలో కొత్తగా ఎంపిక చేసిన ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్లకు నియామక ఉత్తర్వులు అందజేశామని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులతో ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తోందన్నారు. మస్టర్ల విషయంలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పసుమర్రుకు చెందిన జుఝువరపు తేజను, కాపవరం గ్రామానికి చెందిన జ్యోతిషుబాబును ఫీల్డు అసిస్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.రామకృష్ణ, ఏపీఓ పోలురాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మచిలీపట్నంటౌన్: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థి దశ నుంచే కృషి చేయాలని అటవీ శాఖ డెప్యూటీ రేంజ్ ఆఫీసర్లు ఎం. వెంకటేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.
విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, తద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని చెప్పారు. పచ్చదనం పెంపొందించాలని తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తొలుత శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు కోలాటం, రన్నింగ్ గేమ్స్ ఆడారు. భగవద్గీత శ్లోకాలు, ధ్యానం, యోగా చేయించారు. నగరంలోని ఈడేపల్లి, చిలకలపూడి గ్రంథాలయాల్లో కూడా విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

వైభవంగా శాంతి కల్యాణం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో ఇటీవల ప్రతిష్ఠోత్సవం జరిగిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం 16 రోజుల పండుగ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.
గ్రామంలోని 36 జంటలు పీటలపై కూర్చోగా నూతన ఆలయంలో ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు.

అంగన్‌వాడీ సహాయకుల ఉద్యోగాలకు దరఖాస్తులు

కైకలూరు: సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం(ఐసీడీఎస్) కైకలూరు సెక్టార్ పరిధిలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకురాలు ఉద్యోగాలకు దరఖాస్తులు కోరుతున్నామని సీడీపీఓ బి.ఆనందబాబు శుక్రవారం పేర్కొన్నారు. సోమేశ్వరం (ఎస్సీ), శీతనపల్లి-1 (బీసీ-బీ), దొడ్డిపట్ల-2 (ఎస్సీ), కై కలూరు-15 (బీసీ-డీ), న్యూ కొండంగి (ఓసీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. స్థానిక వివాహిత 2022 జులై 1 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల్లోపు వయసు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై నివాస, కుల, పుట్టిన, ఆధార్ ధ్రువీకరణ పత్రాలను జతచేసి జూన్ 2వ తేదీ సాయంత్రం 5 గంటలోపు కైకలూరు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులను అందించాలని కోరారు.

ముదినేపల్లి రూరల్: మండవల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మండవల్లి సీడీపీఓ డి.ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ముదినేపల్లి మండలం చేవూరుపాలెం కేంద్రంలో కార్యకర్త పోస్టు, చిగురుకోట కేంద్రంలో సహాయకురాలు, మండవల్లి-1 కేంద్రంలో సహాయకురాలి పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయండి



గ్రీన్ విలేజ్‌లో జరుగుతున్న పనులపై సూచనలు చేస్తున్న కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కై కలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో నిర్వహిస్తోన్న పనులను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందిస్తోందన్నారు. తక్కువ ధరలో నాణ్యతా ప్రమాణాలతో ఇంటి నిర్మాణాలకు ఆర్తి సంస్థ ముందుకొచ్చిందన్నారు. లబ్ధిదారులకు నిర్మాణాలపై అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణదారులకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు

పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్



కురుమద్దాలిలో సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

కురుమద్దాలి(పామర్రు): అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పామర్రు ఎమ్మెలే కై లే అనిల్‌కుమార్ అన్నారు. కురుమద్దాలిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశారు. గత నాలుగు ఏళ్ల ప్రభుత్వ పాలనలో ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను స్థానికులకు వివరించారు. సంక్షేమ పథకాల బ్రోచర్లను ఇంటింటికీ వెళ్లి అందించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. స్థానికులు గ్రామంలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు తాడిశెట్టి శ్రీనివాసరావు, కొణతం వెంకటేశ్వరమ్మ, రత్నకుమారి, సర్పంచ్ విజయభారతి, పార్టీ నాయకులు చిగురుపాటి ప్రవీణ్,నూతక్కి బుజ్జి, ఎం.సత్యనారాయణరెడ్డి, ముప్పిడి సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలకరి కంటే ముందు నవధాన్యాల సాగు మంచిది



నవధాన్యాల కిట్ల తయారీపై అవగాహన కల్పిస్తున్న 'ప్రకృతి వ్యవసాయ' అధికారి పార్థసారథి

కనుమూరు(పామర్రు): తొలకరి వానలకు ముందు నవధాన్యాల సాగు చేస్తే అధికంగా దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి పార్థసారథి చెప్పారు. కనుమూరులో ప్రకృతి వ్యవసాయం సాగుపై శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవధాన్యాల కిట్లను తయారు చేసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు అవలంబిస్తున్న రసాయన వ్యవసాయంతో పెట్టుబడులు ఎక్కువ కావడమే కాకుండా భూసారం దెబ్బతిని దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారు. దీన్ని అధిగమించడం కోసం ఇందుకు ప్రత్యామ్నాయంగా తక్కువ పెట్టుబడితో రైతులకు పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి మేలు చేసే ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించి పంటలు సాగు చేయాలన్నారు. తొలకరి వర్షాల కంటే ముందు 32రకాల విత్తనాలతో ప్రీ మాన్సూన్ డ్రై షోయింగ్ విధానంతో విత్తన గుళికలు తయారు చేసుకోవడంపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ అనూష, ప్రకృతి వ్యవసాయ జిల్లా అసోసియేట్ కృషి, మాస్టర్ ట్రైనర్ రామోహన్‌రెడ్డి, సబ్ డివిజన్ యాంకర్ పోతులయ్య, యూనిట్ ఇన్‌చార్జి చైతన్య, రాంబాబు, గంగాధర్, దేవచంద్ర, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలోమాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

గుడ్లవల్లేరు: పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయటమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ అన్నారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కొడాలి సురేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఇంటి వద్దకే వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందించడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఎంపీపీ చెప్పారు. జూన్ 12 నుంచి పాఠశాలల ప్రారంభమవుతాయని ఎంఈఓ సుబ్రహ్మణ్యం అన్నారు. లబ్ధిదారులు గృహ నిర్మాణం చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఎస్.ఫణి కుమార్ కోరారు. సమావేశంలో తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తాన్, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, అధికార ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భావనారుషి స్వామి కల్యాణం

పెడన: స్థానిక కొలుకులవారి వీధిలోని భద్రావతి సమేత భావనారుషి స్వామి వారి దేవస్థానం తొమ్మిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్వామి వారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివశ్రీ అయిలూరి జైకిషోర్ ఈశాన శివాచార్య ఆధ్వర్యంలో విట్టంశెట్టి లీలా వెంకట సుబ్రహ్మణ్యం, రాణి దంపతులతోత స్వామివారి కల్యాణాన్ని జరిపించారు.
తొలుత స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. విశేష అర్చనలు జరిగాయి. కల్యాణం అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు పర్యవేక్షించారు.